క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అలంకార్ సబ్‌స్టేషన్ విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ అప్సర ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 12వ తేదీ బుధవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లెనిన్ సెంటర్, అప్సర థియేటర్ రోడ్డు, రాజగోపాలచారి వీధి, బీసెంట్ రోడ్డు, జేడీ హాస్పటల్ రోడ్డు, చేపల మార్కెట్ ఏరియా, గోపాల్ రెడ్డి రోడ్డు, ఏఎంసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకు పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి లోకేశ్వరి పర్యవేక్షించారు.

నూజివీడురోడ్డులో కల్వర్టు నిర్మాణాలు



పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ డివిజన్ ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యాన విజయవాడ–నూజివీడు ఆర్‌అండ్‌బీ రహదారిలో బాక్స్ కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయని మంగళవారం ఆర్ అండ్‌బీ డీఈ శశిభూషణ్ తెలిపారు. బుడమేరు వరదలు సంభవించినప్పుడు వరద నీరు రోజుల తరబడి నిలవడంతో కండ్రిక, రాజీవ్‌నగర్, ప్రజాశక్తి నగర్ పరిసర పల్లపు ప్రాంతాల్లో ప్రజానీకం అనేక అవస్థలు పడిన విషయం తెలిసిందే. భవిష్యత్‌లో వరదలు సంభవిస్తే ప్రజలకు ఇబ్బంది కలగకుండా వరదనీరు ఎప్పటికప్పుడు పారేలా బాక్స్ కల్వర్ట్లు నిర్మిస్తున్నామని డీఈ శశిభూషణ్ తెలియచేశారు. నూజివీడు రోడ్డులో కండ్రిక వాటర్ ట్యాంక్ నుంచి డీ మార్ట్ షాపింగ్ వరకు అనగా కిలో మీటరు పొడవులో నాలుగు బాక్స్ కల్వర్టులు నిర్మిస్తామని ఆయన తెలిపారు. ఒక్కో బాక్స్ కల్వర్టు నిర్మాణానికి రూ.50లక్షల అంచనాలతో మొత్తం రెండు కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. బాక్స్ కల్వర్ట్లు నుంచి కింద ప్రాంతాలకు వెళ్లే వరద నీరు ఇన్నర్‌రింగ్ రోడ్డులోని ముస్తాబాదు కాల్వకు పంపుతామని తెలిపారు. ప్రస్తుతం ఒక బాక్స్ కల్వర్టు పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వర దేవస్థానం వార్షికోత్సవం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగళా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం వార్షిక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారు చందనము లేపన అలంకారంలో భక్తులకు దర్శనమించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఈవో వై.సీతారామయ్య భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఈట్ స్ట్రీట్‌లో సమస్యలపై ఫిర్యాదు చేస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'షాడో ఆగడాలు' పేరుతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై మునిసిపల్ అధికారులు స్పందించారు. ఈట్ స్ట్రీట్‌లో ఫుడ్ బళ్ల విషయంలో ఎవరైనా జోక్యం చేసుకుంటే తమకు ఫిర్యాదు చేయాలని ఎస్టేట్ ఆఫీసర్ కోరారు. ఈట్ స్ట్రీట్‌లో శానిటేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ద్వారా జరుగుతోందని, వ్యాపారులు ఎవరి కరెంట్ చార్జీలు వారే చెల్లించుకుంటారని తెలిపారు.

26న మహాశివరాత్రి ఉత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 26న మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దాట్ల వెంకట నరసింహరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. స్వామి వారికి విశేషంగా అభిషేకాలు, లింగోద్భవ కాలంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 27వ తేదీ గురువారం తెల్లవారుజామున 2 గంటలకు శాంతి కణం జరుగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారి ఊరేగింపు ముత్యాలంపాడు పురవీధుల్లో చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం దాత రాజేంద్రప్రసాద్ దంపతులతో అన్నప్రసాద వితరణ చేస్తామని వివరించారు.

కర్మల భవన్‌కు మోక్షమెప్పుడో!

- సత్యనారాయణపురం వాసుల అవస్థలు
- గత ప్రభుత్వం హయాంలో కౌన్సిల్‌లో ఆమోదం
- ప్రభుత్వం మారడంతో ముందుకు సాగని పనులు



ఎస్ఎన్‌పురం.. జీఎస్ రాజు రోడ్డులో కర్మల భవనం నిర్మించాల్సిన స్థలమిదే..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎస్ఎన్‌పురంలో కర్మల భవన్ నిర్మాణానికి మాత్రం మోక్షం కలగడం లేదు. సుమారు 40 ఏళ్ల క్రితం స్థానికులు కర్మకాండలు జరుపుకోవడానికి సత్యనారాయణపురంలోని.. జీఎస్‌రాజు రోడ్డు వద్ద వాటర్ ట్యాంక్ సమీపంలో మూడు బ్లాకుల్లో కర్మల భవన్ నిర్మించారు. అయితే ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన్ నిర్మాణానికి గత ప్రభుత్వం నగరపాలకసంస్థ కౌన్సిల్‌లో ఆమోదం తెలిపింది. పాత భవనాలను కూల్చేసి వాటి స్థానంలో సుమారు 600 గజాల్లో నూతన భవనం నిర్మించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కర్మల భవనం నిర్మాణ పనులు ప్రశ్నార్థకంగా మారాయి.

కర్మకాండలకు స్థానికుల ఇబ్బందులు

ఎస్ఎన్‌పురంతో పాటు పరిసర ప్రాంతవాసులు కర్మల భవనాన్ని వినియోగించేవారు. శిథిలావస్థకు చేరిన దీన్ని తొలగించి కొత్త భవనానికి చర్యలు తీసుకున్నా ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా అద్దె ఇళ్లలో ఉండేవారే. వారి కుటుంబ సభ్యులు కాలంచేస్తే వారి ఇళ్ల వద్ద కర్మకాండలు చేసేకునే అవకాశం లేదు. దీంతో దూరప్రాంతాలకు వెళ్లి ఆ కార్యక్రమాలను ముగించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ఆయా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని త్వరతగతిన కర్మల భవనం నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

రూ. 2 కోట్లతో నిర్మాణం

సత్యనారాయణపురంలో ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఒక స్వచ్ఛంద సంస్థ రూ. 2 కోట్లతో కర్మల భవనం నిర్మాణం చేయడానికి ముందుకు వచ్చింది. గతంలోనే స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి ఈ విషయంపై కౌన్సిల్‌లో తీర్మానం చేయడంతో ఆమోదం పొందింది. దీంతో పాత భవనాలను తొలగించి నూతన భవన నిర్మాణానికి పనులు మొదలయ్యాయి. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, దీన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు విషయాన్ని పట్టించుకోకపోవడంతో ఆ పనులు కాస్తా నిలిచిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కర్మల భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



గతంలోనే కర్మల భవనం నిర్మాణానికి స్వచ్ఛంద సంస్థ సహకరించేందుకు ముందుకు వచ్చింది. దీనిపై కౌన్సిల్‌లో ప్రతిపాదనలు పెట్టడంతో ఆమోదం లభించింది. అనంతరం ప్రభుత్వం మారటంతో పనులు కొంత ఆలస్యం అయ్యాయి. ఈ విషయాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి త్వరితగతిన కర్మల భవనం నిర్మాణానికి కృషి చేస్తాను.

– శర్వాణీమూర్తి, 33వ డివిజన్ కార్పొరేటర్

ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయండి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కాశీనాథ్

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులందరినీ ఆప్కాస్ నుంచి మినహాయించి కాంట్రాక్టు పద్ధతిలో దళారులకు అప్పచెప్పడం సరికాదని, వారందరిని పర్మినెంట్ చేయడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు డి.కాశీనాథ్ అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆప్కాస్‌లో కార్మికులందరికీ ప్రతి నెల 1 నుంచి 5తేదీ లోపు జీతాలు పడతాయని, ఆప్కాస్‌ను మినహాయించి దళారులకు కాంట్రాక్ట్ పద్ధతిలో అప్పగిస్తే దళారుల ఇంటి ముందు ధర్నాలు చేస్తామన్నారు. ఇలా ఇస్తే జీతాలు వచ్చే పరిస్థితి ఉండదని, ఇలాంటి చర్యలను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులను దళారులకు అప్పచెబితే నెలాఖరు నుంచి సమ్మెకు వెళతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు పాల్గొన్నారు.

ఘంటసాల గానామృతం భావి తరాలకు అందించాలి



తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని ఘంటసాల విగ్రహం వద్ద చంద్రశేఖర్, గోళ్ల నారాయణరావు

విజయవాడ కల్చరల్: గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు గానామృతాన్ని భావి తరాలకు అందిచాలని కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. ఘంటసాల కళావేదిక ఆధ్వర్యాన మంగళవారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఘంటసాల వర్ధంతిని నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ తెలుగు వారుతున్నంత వరకు ఘంటసాల స్వరం ఉంటుందని తెలిపారు. సద్గురు త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్టు నగరంలోని సంస్థలు ఘంటసాల ఉత్సవాలను చేయాలన్నారు.

ఘంటసాల కళావేదక నిర్వాహకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ కళలతోనే మనోవికాసం కలుగుతుందన్నారు. 2009లో కళాపోషకుడు శింగంశెట్టి పెద బ్రహ్మం ఘంటసాల విగ్రహాన్ని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్మాణం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, గాయకులు శ్యాం ప్రసాద్, డాక్టర్ రామతీర్థ, డేవిడ్‌రాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘంటసాల సంగీత కళాశాల ఆధ్వర్యంలో

ఏపీ భాషా సాంస్కృతిక శాఖ, ఘంటసాల సంగీత కళాశాల ఆధ్వర్యాన సంగీత కళాశాలలోని గోకరాజు గంగరాజు కళావేదిక పై గాయకుడు గుడిపాటి హరి కృష్ణ. సుధాశ్రీనివాస్ బృందం పలు ఘంటసాల పాటలను ఆలపించారు. భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మల్లికార్జునరావు, ఉప సంచాలకుడు పెంచలయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనరసమ్మ, అధ్యాపకులు పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా మాస్టర్ అథ్లెట్లు సత్తా



రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా మాస్టర్ అథ్లెట్‌లు

విజయవాడస్పోర్ట్స్: అనంతపురంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి 43వ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన 26 మందిలో 21 మంది పలు విభాగాల్లో 52 పతకాలను సాధించి సత్తా చాటారు. పతకాలు సాధించిన రామస్వామి, గంగాధరరావు, నెల్సన్, జోజి, వెంకట్రావు, రవీంద్రరావు, తిలక్, సాంబశివరావు, సత్యనారాయణ, జ్యోతిప్రకాష్, జమాల్‌బాబు, రామకృష్ణ, శ్రీనివాసనాయక్, కోటేశ్వరరావు, శివగణేష్‌బాబు, రాజేశ్వర్, సుబ్బలక్ష్మి, చంద్రమణి, గీతాంజలి, అరుణ, కుముద్వతి త్వరలో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించడంతో పాటు జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్న క్రీడాకారులను జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి జి.వి. ప్రసాదరావు అభినందించారు.

అర్చకుడు రంగరాజన్‌పై దాడి దారుణం: సీపీఐ

సాక్షి, అమరావతి: చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని సీపీఐ రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. విజయవాడ దాసరి భవన్‌లో మంగళవారం జరిగిన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం ఇటీవల జరిగిన పలు దాడులను ఖండిస్తూ తీర్మానం చేసింది. రంగరాజన్ ఇంట్లోకి చొరబడి ఆయనపై దాడి చేయడం దారుణమని, హైదరాబాద్ పుస్తక పుస్తక మహోత్సవంలో ఎన్.వేణుగోపాల్‌పైన, తిరుపతి పుస్తక మహత్సవంలో విశాలాంధ్ర బుక్‌హౌస్ స్టాల్‌లో పుస్తకాన్ని చించి తగలబెట్టేందుకు దుండగులు చేసిన ప్రయత్నాలను సీపీఐ తీవ్రంగా ఖండించింది. గత పదేళ్లుగా దేశంలోని హిందుత్వ భావజాల పక్షం, దాని అనుకూల పక్షాలు ఉన్న రాష్ట్రాల్లో ఇలాంటి దాడులు పెరిగాయని సీపీఐ ఆందోళన వ్యక్తం చేసింది. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పార్టీ రాష్ట్ర నేతలు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణ మూర్తి, జెల్లి విల్సన్, అక్కినేని వనజ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి నుంచి తప్పనిసరిగా చెత్త సేకరించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డివిజన్‌లో ప్రతి ఇంటి నుంచి చెత్తను తప్పనిసరిగా సేకరించాలని ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి అన్నారు. మంగళవారం గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్మికులకు పలు సూచనలు చేశారు. డ్రెయిన్లలో మురుగు నీరు సక్రమంగా ప్రవహించేలా చూడాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరానికి ర్యాంక్ వచ్చేలా పారిశుద్ధ్య కార్మికులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ శ్రీనివాస్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'టెన్త్' క్వశ్చన్ పేపర్స్ పుస్తకాలు అందజేత

పాయకాపురం(విజయవాడరూరల్): ఎల్‌బిఎస్ నగర్ పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో పదవ తరగతి లో ప్రతిభ కనబర్చుతున్న ఏడుగురు విద్యార్థులకు ఆల్ సబ్జెక్ట్స్ క్వశ్చన్ పేపర్స్ అండ్ ఆన్సర్స్ పుస్తకాలను మంగళవారం ఇన్‌చార్జి హెచ్‌ఎం డాక్టర్ మైనం హుస్సేన్ అందజేశారు. హైస్కూల్ నుంచి ఈ ఏడాది 145 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరవుతున్నారన్నారు.

ఆశీర్వదించు మరియమాతా..









గుణదల మేరీమాత ఉత్సవాల్లో చివరి రోజు మంగళవారం దేశవిదేశాల నుంచి వచ్చిన విశ్వాసులతో పుణ్యక్షేత్రం కిటకిటలాడింది. విదేశీ యాత్రికులు ఉత్సవాల్లో ఆకర్షణగా నిలిచారు. ఆలయ గురువులు సమష్టి దివ్య బలిపూజ నిర్వహించారు. ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేలా ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విశ్వాసులు మరియమాతను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవుని తల్లి.. ఆశీర్వదించు మాతా అంటూ వారు మరియమాతను ప్రార్థిస్తూ ఇళ్లకు వెనుదిరిగారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం కచ్చితంగా అమలుచేయడానికి నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటోందని దీనిపై మూడు సర్కిళ్ల పరిధిలో వీఎంసీ జోనల్ కమిషనర్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారని కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు అమ్మకాల హోల్‌సేల్ వ్యాపారులు, రిటైలర్లు, హోటల్, క్యాటరింగ్, కర్రీ పాయింట్, బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాప్ యజమానులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎన్‌జీవోలు, స్వయం సహాయక సంఘాల సభ్యులందరితో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై జోనల్ కమిషనర్లు సమావేశం నిర్వహించారని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగం, అమ్మకం దానితో కలిగే అనర్థాలు, అనారోగ్య సమస్యలు వంటి విషయాలపై అధికారులు అవగాహన కల్పించారని వివరించారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ చట్ట ప్రకారం 120 మైక్రోన్స్ పరిమాణం కంటే తక్కువ పరిమాణమున్న సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ అమ్మకాన్ని వీఎంసీ నిషేధించిందని పేర్కొన్నారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకానికి ప్రత్యామ్నాయంగా వాడాల్సిన వస్తువులు, పర్యావరణ హిత పదార్థాలతో తయారు చేయచేసిన వస్తువుల వాడకాన్ని సమావేశానికి వచ్చిన వారికి వివరించారని తెలిపారు.

పాయకాపురం(విజయవాడరూరల్): మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు 64వ డివిజన్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించే పలు దుకాణాల్లో వీఎంసి సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. నిషేధంలో వున్న 120 మైక్రోన్స్ కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ ను వాడుతున్న వారికి జరిమానాలు విధించారు. శానిటరీ సెక్రటరీ గోపీరాజు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్ల బకాయిలు విడుదల చేయండి

ఆజాద్ ముస్లిం కమిటీ



షేక్ ఖాజాకు నియామక పత్రం అందజేస్తున్న షేక్ నాగుల్ మీరా

పాయకాపురం(విజయవాడరూరల్): కూటమి అధికారం చేపట్టిన తర్వాత ఇమామ్, మౌజన్‌లకు చెల్లించాల్సిన పాత బకాయిలు విడుదల చేయాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా డిమాండ్ చేశారు. కండ్రికలో మంగళవారం జరిగిన కమిటీ సభ్యుల సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా ఆజాద్ ముస్లిం కమిటీ ప్రధాన కార్యదర్శి గా షేక్ ఖాజాను నియమించి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల్లో 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. రంజాన్ మాసంలో రంజాన్ తోఫా అందజేయాలని, దుల్హన్ పథకాన్ని అమలు చేయాలని, వక్ఫ్ బోర్డు ఆస్తులపై సర్వే నిర్వహించి ఆక్రమణలకు గురైన ఆస్తులను కాపాడాలన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో ముస్లింలకు దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. పేద ముస్లింలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలను వెంటనే కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ,నగర ఉపాధ్యక్షులు షేక్ సైదులు, సెంట్రల్ నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షులు షేక్ షరీఫుద్దీన్, 58,59,64వ డివిజన్ల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అయోధ్యనగర్‌లో అగ్నిప్రమాదం

రూ.2.50 లక్షల ఆస్తి నష్టం



అయోధ్యనగర్ లోటస్‌లో జరిగిన అగ్నిప్రమాదం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్‌లోని లోటస్ ల్యాండ్ మార్క్ సెక్టార్-3లోని ఓ గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న షాపుల్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో రూ. 2 లక్షల విలువ చేసే గృహోపకరణాలతో పాటు బీరువాలో ఉంచిన రూ. 50 వేల నగదు కాలిపోయాయి. ఎటువంటి ప్రాణనష్టం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల ప్రకారం లోటస్ ల్యాండ్ మార్క్ సెక్టార్-3లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో కూచిపూడి శేషాకుమారి అనే వృద్ధురాలు తినుబండారాలు తయారు చేసి విక్రయిస్తుంటుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో గ్యాస్ పొయ్యిపై నీళ్లపెట్టి బయట వంట పాత్రలు శుభ్రం చేస్తున్నారు. గ్యాస్ పొయ్యి నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి క్షణాల్లోనే రెండు దుకాణాలకు వ్యాపించడంతో వృద్ధురాలు బయటకు పరుగులు తీసి ప్రాణం కాపాడుకుంది. ఘటనలో దుకాణాల్లోని వస్తువులు, గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. ఘటన విషయం తెలియడంతో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండె సుందర్‌పాల్, శ్యాంబాబులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి స్థానికుల సాయంతో అందుబాటులో ఉన్న నీటితో మంటలను ఆదుపుచేసే ప్రయత్నం చేశారు. అనంతరం ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను పూర్తిగా అదుపుచేశారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం ప్రకారం బిల్డింగ్ వర్కర్స్ బోర్డు నిధులను వారి సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని, మరే ఇతర ఇతర అవసరాలకు వాడకూడదని ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జిల్లా కమిటీతో కలిసి విజయవాడలోని లేబర్ కమిషనర్ ఎంవీ శేషగిరిబాబును మంగళవారం కలిసి మాట్లాడారు.

ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. వలస కార్మికులకు మన రాష్ట్రంలో ఏ విధమైన చట్ట భద్రత లేని నేపథ్యంలో బోర్డును పునరుద్ధరించి దానిలోని పథకాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

చట్ట భద్రత కల్పించాలి..

రాష్ట్రంలో అసంఘటిత భవన నిర్మాణ కార్మికులు 30 లక్షల మంది ఉన్నారని, అందులో ఉమ్మడి కృష్ణా జిల్లాలో 2,50,000ల మంది ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వచ్చే వలస కార్మికులకు సంక్షేమ బోర్డు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, తద్వారా పథకాలను వారికికూడా అమలు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా 60 ఏళ్లు దాటిన కార్మికులకు పెన్షన్ సౌకర్యంతో పాటు సొంత ఇంటి కలను బోర్డు ద్వారా నెరవేర్చాలని, చట్ట భద్రత కల్పించాలని కోరారు.

జ్యోతి పట్టుదల ప్రశంసనీయం



అథ్లెట్ జ్యోతిని అభినందిస్తున్న రాఘవేంద్రరావు, హైమ

విజయవాడస్పోర్ట్స్: ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడల్లో సత్తా చాటుతున్న అథ్లెట్ జ్యోతి యర్రాజీ పట్టుదల ప్రశంసనీయమని దక్షిణ భారత అథ్లెటిక్స్ మానటరింగ్ కమిటీ చైర్మన్ ఆకుల రాఘవేంద్రరావు అన్నారు. రాష్ట్రానికి చెందిన అథ్లెట్ జ్యోతి యర్రాజీ 100 మీటర్ల హర్డిల్స్‌లో ఇటీవల గోల్డ్ మెడల్ సాధించిన విషయం తెలిసిందే. మంగళవారం జరిగిన 200 మీటర్ల రన్నింగ్‌లోనూ అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అథ్లెట్ జ్యోతిని రాఘవేంద్రరావు, ఏపీఅథ్లెటిక్స్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి హైమ అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఒలింపిక్ పతకం సాధించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

షేక్ యాసిన్‌కు గోల్డ్

జిమ్నాస్టిక్‌లో రాష్ట్ర క్రీడాకారిణి షేక్ యాసిన్‌ను మంగళవారం గోల్డ్ మెడల్ సాధించినట్లు ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) స్పోర్ట్స్ ఆఫీసర్ కోటేశ్వరరావు తెలిపారు. కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్ఏ) కోచ్ సురేష్ వద్ద యాసిన్ చిన్ననాటి నుంచి శిక్షణ తీసుకుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 38వ జాతీయ క్రీడల జిమ్నాస్టిక్స్‌లో అన్ని రాష్ట్రాల క్రీడాకారులను వెనక్కి నెట్టి ఏపీకి బంగారు పతకం అందించిన యాసిన్‌ను అభినందించారు.

•నిరసన విజయవంతం చేయండి

కృష్ణలంక(విజయవాడ తూర్పు): భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 24వ తేదీన కలెక్టర్ కార్యాలయాల వద్ద చేయనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సోనా రాజు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్మికులు పాల్గొనాలని కోరారు.